ప్రజాశక్తి
సోమవారం 4 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం

అంగన్వాడీల సమ్మెకు మద్దతు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నగరంలోని కొత్త రోడ్డు కూడలి వద్ద ఉన్న ఐఎఫ్‌టియు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు దంతం వెంకన్న అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 8 నుంచి అంగన్వాడీలు నిర్వహించనున్న సమ్మెకు పూర్తి మద్దతును ప్రకటించామని తెలిపారు. అంగన్వాడీలకు తెలంగాణా రాష్ట్రం కంటే ఎక్కువ వేతనం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీకి కావస్తుందని అన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలన్నారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, గణేష్, కృష్ణవేణి, సింహాచలం, సూర్యనారాయణ, అప్పారావు, జయప్రద, బాబూరావు పాల్గొన్నారు.

బిజెపి విధానాలు ప్రమాదకరం

- ఆ పార్టీని ఓడిస్తేనే దేశానికి మేలు
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత
- కార్పొరేట్ల కోసం మోడీ, జగన్ పనిచేస్తున్నారు
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- శ్రీకాకుళంలో జాతీయ సెమినార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు అత్యంత ప్రమాదకరమని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మికవర్గంపై దాడి-పరిష్కారాలు' అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వం కార్మికవర్గంపై దాడిని తీవ్రతరం చేసే విధానాలు అవలంబిస్తోందని, వాటిని అర్థం చేసుకుని ఎదుర్కోవడానికి కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో అన్ని తరగతులూ తీవ్ర అసంతృప్తిలో ఉన్నాయన్నారు. ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లను వినేందుకూ మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఐసిడిఎస్‌లో 40, 50 ఏళ్లుగా పనిచేస్తున్నా అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించడానికి అంగీకరించడం లేదని విమర్శించారు. మధ్యాహ్న భోజన, ఆశా వర్కర్లకూ కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ ఇవ్వడం లేదని చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎకానమీలో మంచి ప్రగతి కనబరచడం సహజమని, తలసరి ఆదాయంలో ప్రపంచ దేశాల్లో దేశం అట్టడుగున ఉందని చెప్పారు. దేశంలో పేదలు, సంపన్నుల మధ్య అంతరాలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, మహిళల్లో రక్తహీనత అంశాల సంగతేమిటని ప్రశ్నించారు. కార్మిక సంఘాలు నిర్వీర్యం చేసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. ఉద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్ల పోరాటం వల్లే కొన్ని హక్కులు సాధించుకోగలిగామని, లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే సమ్మె హక్కూ ఉండదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో ఒకే పరిశ్రమలో శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఫిక్సిడ్ టెర్మ్ ఉద్యోగులు ఉండటంతో వారి మధ్య ఐక్యత దెబ్బతింటోందన్నారు. రైల్వేలు, బిఎస్ఎన్ఎల్, పోర్టులు ఇలా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌కు అప్పగిస్తోందని, వారు యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయనున్నారని చెప్పారు. రైల్వేస్టేషన్ డవలప్‌మెంట్ అథారిటీ పేరుతో రైల్వే స్థలాలు, భూములను ప్రయివేట్‌కు అప్పగించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. దీంతో స్థలాల్లో పాకలు వేసుకుని బతుకుతున్న పేదలను ఖాళీ చేయించి కమర్షియల్‌గా ఉపయోగించుకుంటారని చెప్పారు. మైనింగ్, మినరల్ చట్టాన్ని సవరించి అనుమతులతో సంబంధం లేకుండానే తవ్వుకునేందుకు అవకాశం కల్పిస్తోందని అన్నారు. దీనివల్ల గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని చెప్పారు. మరోవైపు బ్లూ ఎకానమీ పేరుతో సముద్ర తీరంలో ఖనిజ తవ్వకాలకు అనుమతులిస్తూ మత్స్యకారులకు నష్టం చేస్తోందన్నారు. బిజెపి విధానాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన బిజెపినే సమర్థిస్తున్నాయని విమర్శించారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ సంస్కరణలను రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను వినియోగదారులే రూ.7, 8 వేలకు కొని ఏర్పాటు చేసుకోవాలని, సక్రమంగా పనిచేయకుంటే భారీగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వం కొన్ని తరగతులకు ఇస్తున్న సబ్సిడీలు ఉండవని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేసే వారి దృష్టిని మరల్చేందుకు మతాలు, భాషల పేరుతో ప్రజల మధ్య బిజెపి చిచ్చు పెడుతోందని చెప్పారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సంపద సృష్టిస్తున్నారని, మోడీ మాత్రం పెట్టుబడిదారుల వల్లే ఉత్పత్తి జరుగుతోందని భావిస్తున్నారని చెప్పారు. బిజెపి అనుసరిస్తున్న విధానాలకు ప్రజలు అనుభవిస్తున్న నష్టాన్ని వివరించాలని, సిఐటియు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న నర్సింగరావు)

పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే: నర్సింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సిఐటియు నాయకులు శెట్టి పర్సా సత్యనారాయణ జీవితం కార్మికులు, కర్షకులకు అర్పించారని చెప్పారు. దేశంలో కార్మిక రాజ్యం రావాలన్న సత్యనారాయణ ఆశించారన్నారని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించకుండా వారితో వెట్టి చాకిరీచేయిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, ఈ నెల 8న నుంచి నిరవధిక చేపట్టనున్న సమ్మెతో తాడోపేడో తేల్చుకోనున్నారని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండటం వల్లే ఎస్సీ, ఎస్టిలకూ ఉద్యోగాలు వచ్చాయని, జిల్లాలో ఉన్న అరబిందో, యునైటెడ్ బెవరేజస్ కంపెనీలు ఇవ్వడం లేదన్నారు. సోషలిజం ఉంటే రిజర్వేషన్లు అవసరం లేదని, అది లేనందు వల్లే రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అడుగుతున్నామని చెప్పారు. కార్మికులు, కర్షకులు అంతా ఏకతాటిపైకి వచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నాగమణి, ఎన్.వి.రమణ, ఎం.ఆదినారాయణమూర్తి, డి.సుధ, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, జి.అమరావతి, బి.ఉత్తర, కె.కళ్యాణి, డి.ధనలక్ష్మి, త్రినాథ్, చిన్నారావు పాల్గొన్నారు.

తేజేశ్వరరావుకు పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ దంపతులను సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి సిహెచ్. నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావులు ఆదివారం పరామర్శించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ సెమినార్‌కు హాజరయ్యేందుకు వచ్చిన నాయకులు వారిని పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాన్ని వారికి అందజేశారు.

మిచౌంగ్ కలవరం

- అప్రమత్తం చేసిన అధికారులు
- నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో ఆదివారం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం గాలులు తీవ్రత స్వల్పంగా పెరిగింది. తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాలు వర్షాలు పడతాయని హెచ్చరికలు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పంట కోతలు ఇప్పుడిప్పుడే జోరందుకుంటున్న సమయంలో వర్షాలు పడటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. తుపాను నేపథ్యంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరి కోతలు ఆపేయాలని సూచించారు. ఇప్పటికే కోతలు కోసి ఉంటే వరిని కుప్పలుగా వేసి పరదా కప్పి భద్రపర్చుకోవాలని చెప్పారు. ధాన్యం భద్రపర్చుకోవడానికి అవకాశం లేకుంటే అమ్ముకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే అందుబాటులో గల రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆర్‌బికెల్లో ధాన్యం ఇచ్చి సమీపంలో ఉన్న మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ దండోరా వేయించి రైతులకు అప్రమత్తం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు

నేడు స్పందన రద్దు

మిచౌంగ్ తుపాను కారణంగా సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండనందున రద్దు చేస్తున్నట్లు ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మరో వైపు ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించనున్న స్పందననూ అధికారులు రద్దు చేశారు. మిచౌంగ్ తుపాను దృష్ట్యా సోమవారం జరగనున్న పోలీసు స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు విషయాన్ని ప్రజలు గమనించి వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రావద్దని స్పష్టం చేశారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి వివిధ మార్గాల్లో నడుస్తున్న ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్/పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్ స్కీంలో ఎంపికైన ప్రయాణికులకు డిపో మేనేజర్ శర్మ ఆదివారం బహుమతులు అందించారు. నవంబరు 16 నుంచి 30 వరకూ రెండు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్/పల్లె వెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జి.కె.వలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులకు డ్రా తీశారు. ఇందులో సాలూరు మార్గంలో ప్రయాణించిన శ్రీనివాసరావు, రామకృష్ణ, తరంగిణి, చీపురుపల్లి మార్గంలో చందు, చిన్నా, సుష్మిత, బందరువానిపేట మార్గంలో సాయికిరణ్, హృదయ నందన్, తేజేశ్వరి, ఆమదాలవలస మార్గంలో హర్ష, సూర్యకుమారి, జగదీష్, విజయనగరం మార్గంలో అప్పలరాజు, శంకరరావు, యరగాం మార్గంలో హేమలత, జి.కె.వలస రహదారిలో గంగమ్మ, శ్రీముఖలింగం రూట్‌లో సాయికృష్ణ, మురళీకృష్ణ ఎంపికయ్యారు. విజేతలకు బోయిన పృథ్వీ, ఊన్న కిరణ్‌కుమార్ జిఎన్‌వి జ్యూయలర్స్, సౌజన్యంతో బహుమతులను అందజేశారు. డిపో మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ, సహాయ మేనేజర్లు రమేష్, శంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, మూర్తి పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న డిపో మేనేజర్ శర్మ

బోధనేతర పనులు అప్పగించవద్దు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నాలుగు నెలల్లో అధికారులు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేస్తున్నారని, ఉపాధ్యాయులకు భోధన కాకుండా బోధనేతర పనులను అప్పజెప్పి పని ఒత్తిడిని పెంచుతున్నారనిఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యుటిఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావ్యవస్థలో పర్యవేక్షణ అన్న పదానికి అర్థం తెలియని వారికి అధికారం, ఉపాధ్యాయులపై అజమాయిషీ ఎందుకని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలపై అవలంబిస్తున్న వైఖరి సరికాదని అన్నారు. అలాగే ఉపాధ్యాయులకు మెమోలు, షోకాజు నోటీసులు జారీ చేస్తున్నారని, దీనికి రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం 2024 ఎన్నికల్లో సమాధానం చెబుతుందని హెచ్చరించారు. కరోనా కాలంలో యుటిఎఫ్ నాయకులు ప్రాణాలకు తెగించి ప్రజల వద్దకు వచ్చి రూ.3.10 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు సహాయ, సహకారాలు అందించామని గుర్తు చేశారు. రేషనల్‌లైజేషన్ పేరుతో రాష్ట్రంలో 14,202 ప్రాథమిక పాఠశాలలు, 28 వేలు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 505 ఉన్నత పాఠశాలలు ఎత్తి వేశారని అన్నారు. దీంతో విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల దారిపట్టారని, వారికి ప్రభుత్వాలు పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు. 5,6,7 తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం తగదన్నారు. సిపిఎస్‌ను రద్దుచేస్తానని సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్ తీసుకొచ్చారని, ఇది ఉపయోగం లేదని, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఎన్నికల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ ఇస్తుందో వారికే మా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని గంట అదనంగా విద్యాబోధన చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సభాప్రాంగణంలో యుటిఎఫ్ నాయకులు మెండ గోవిందరావు, ఎం.వాగ్దేవి, సామ సంజీవరావు, ఆర్.రామేశ్వర పట్నాయక్‌లు యుటిఎఫ్ జెండాను అవిష్కరించారు. అలాగే అభ్యుదయ గీతాలకు ఉపాధ్యా యులు వేసిన డాన్స్‌లు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవేంద్ర, రెడ్డి మోహనరావు, ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్, గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహనరావు, జిల్లా కార్యదర్శులు గొండు నారాయణరావు, వై.వాసుదేవరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఆర్. దమయంతి, స్థానిక మండల నాయకులు బోడాల ఆనందరావు, బి.శ్రీరామ్మూర్తి, ఎల్.బాబూరావు, సింహాచలం, బి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక కోటబొమ్మాళిలో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా కోరాడ వైకుంఠరావు, అధ్యక్షులుగా ఎల్.బాబూరావు, సహాధ్యక్షులుగా కె.దాలయ్య, ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీరామ్మూర్తి, కోశాధికారిగా బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులుగా పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, హనుమంతు అన్నాజీరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, టి.వి.టి.బి.భాస్కరరావు, ఎం.వెంకటరమణ, పి.మురళీధరరావు, జి.మాధవరావు, జి.రమేష్, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎం.మురళీప్రకాష్, బి.శ్రీనివాసరావు, బి.శంకరరావు, జి.శారద, ఎస్.స్వర్ణకుమారిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఎస్.కిషోర్‌కుమార్ ప్రతిపాధించగా, పి.అప్పారావు బలపరిచారు. ఎన్నికల అధికారిగా ఎస్.మురళీహనరావు, పరిశీలకులుగా చౌదరి రవీంద్ర వ్యవహరించారు.

బిఎల్‌ఒలపై కలెక్టర్ ఆగ్రహం

పలాస : బిఎల్‌ఒతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- పలాస

ఓటరు నమోదు, ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు చేయాలని పదేపదే చెబుతున్నా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పోలింగ్ కేంద్రాల వద్ద కూర్చుని ఓటరు జాబితా పరిశీలించి సరిచేసేందుకు ఏమిటి కష్టమంటూ బిఎల్‌ఒలపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ 7వ పోలింగ్ కేంద్రం బిఎల్‌ఒ సిహెచ్.యుగంధర్‌ను సస్పెండ్ చేయాలని తహశీల్దార్ ఎల్.మధుసూదనరావుకు ఆదేశించారు. పలాస ఉన్నత పాఠశాలలో 64, 65, 74, 75, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 4,5,6,7, 16,17 పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. 7వ పోలింగ్ కేంద్రం బిఎల్‌ఒ యుగంధర్ వద్ద ఉన్న ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సమయంలో ఓటరు జాబితా పూర్తిస్థాయిలో లేకపోవడం, జాబితాలో చాలా వరకు ఓటర్ల ఫొటోలు తిరగబడడం తదితర అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలరోజుల నుంచి బిఎల్‌ఒగా విధులు నిర్వహిస్తున్నా... పూర్తిస్థాయిలో జాబితా లేకపోవడం, ఇప్పటికీ ఫొటోలు జత చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆ పనులు నిర్వహించాల్సింది నీదే కదా? ఇంత వరకు ఎందుకు చేయడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. తక్షణమే సస్పెండ్ చేసి ఆయన స్థానంతో కొత్తగా బిఎల్‌ఒను నియమించి పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఓటరు జాబితాపై చేర్పులు, మార్పులు కోసం 27 అక్టోబరు నుంచి ఈ నెల 9 వరకు ప్రతి పోలింగ్ భూతుల వద్దా కేంద్రాలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో 2357 పోలింగ్ కేంద్రాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు బిఎల్‌ఒలు ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కేంద్రాల్లో ఓటర్లు చేర్పులు, మార్పులు నమోదు చేసుకోవచ్చునని అన్నారు. ఈ నెల 9 తరువాతా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాల్లో ఒకే ఇంటి నంబరుతో 8 వేల ఓట్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వాటిలో వివిధ ఓట్లను తొలిగింపు ప్రక్రియ చేపట్టామని, ఇంకా 222 ఓట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటినీ సరిచేసే పనిలో సిబ్బంది నిమగ్నమై ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు వారి వారి ప్రాంతాల్లో ఓటర్ల నమోదుపై ఎటువంటి అభ్యంరాలు, ఓటు నమోదు వంటివి చేయాలంటే పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 9లోగా ఆయా కార్యక్రమాలు రాజకీయ పార్టీలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భరత్ నాయక్, ఎలక్షన్ డిటి రాంబాబు, ఆఐ నిరంజన్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని బిఎల్‌ఒలకు ఆదేశించారు.

సంకల్పానికి వైకల్యం అడ్డు కాదు

జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో సాధారణ పౌరుల కంటే అంగవైకల్యం ఉన్న వారే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సంకల్పానికి వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నారని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ అన్నారు. వికలాంగులశాఖ ఆధ్వర్యాన జెడ్‌పి సమావేశ మందిరంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులు అంటే దివ్యమైన శక్తి గలవారని సూచిక అని అన్నారు. వికలాంగులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. వికలాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో తక్షణమే మంజూరయ్యేలా చూస్తున్నామని పేర్కొన్నారు. సచివాలయ స్థాయిలో సమస్యల పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద బ్యాక్‌లాగ్ పోస్టుల్లో 239 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలు కల్పించామని అన్నారు. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారందరినీ సమాజాభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. వికలాంగులు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని జెసిని కోరారు. కార్యక్రమంలో రూ.1,75,750 విలువ గల ల్యాప్ టాపులు, టచ్ ఫోన్లు, వినికిడి యంత్రాలు వికలాంగులకు అందజేశారు. 52 వికలాంగుల స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.72 లక్షల బ్యాంకు లింకేజి చెక్కును అందజేశారు. ఇటీవల వికలాంగులకు నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వేడుకల్లో ముందుగా బెహరా మనోవికాస కేంద్రం నిర్వాహకులు బెహరా శ్యామల ఆధ్వర్యాన విద్యార్థులు సృష్టికర్త ఒక బ్రహ్మ లఘు నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిఇఒ వెంకటేశ్వర రావు, యూత్ కో-ఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డిపిఆర్‌ఒ కె.బాలమాన్‌సింగ్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న జెసి నవీన్

విద్యుత్ బిల్లుల చెల్లింపులపై నూతన విధానం

- 15వ తేదీ దాటి చెల్లిస్తే 18 శాతం సర్‌ఛార్జీ వసూలు
- ఈ నెల నుంచే అమలు
- 1912 టోల్‌ఫ్రీ సేవలు మరింత విస్తృతం
- రూ.250.4 కోట్లతో ఆర్‌డిఎస్ఎస్ పనులు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇక ప్రతినెలా 2 నుంచి 10వ తేదీ లోపు మీటరు రీడింగ్ తీయనున్నట్లు ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎన్.కృష్ణమూర్తి వెల్లడించారు. బిల్లు అందిన తరువాత 15వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందని, ఆ తరువాత చెల్లించే బిల్లులపై 18 శాతం సర్‌ఛార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విధానం ఈ నెల నుంచే అమలులోకి వచ్చిందని చెప్పారు. జిల్లాలో రోజూ 4.8మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంటోందన్నారు. అత్యధికంగా 237 మెగావాట్లు విద్యుత్ జిల్లాకు అవసరమవుతోందని చెప్పారు. గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో విద్యుత్ సరఫరా, వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.

? జిల్లాలో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వాడకం ఏటా పెరుగుతోంది. వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. పెరుగుతున్న అవసరాలకు అనుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోంది. జిల్లాలో రోజూ సుమారు 48 లక్షల యూనిట్లు (4.8 మిలియన్ యూనిట్లు) విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. అందుకు అవసరమైన 237 మెగావాట్లు విద్యుత్ జిల్లాకు సరఫరా అవుతోంది. వేసవిలో వినియోగం కొంతమేరకు పెరుగుతోంది. పెరుగుతున్న అవసరాలతో పాటు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా వినియోగదారుల సేవలను విస్తృతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రస్తుతం 8.43లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో గృహ అవసరాలకు 7,19,574 కనెక్షన్లు ఉన్నాయి. 30 వేలు వ్యవసాయ పంపు సెట్లు, వాణిజ్య అవసరాలకు 70 వేలు, పరిశ్రమలకు 2,500 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ అవసరాలకు 21 వేల కనెక్షన్లు ఉన్నాయి.

? నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచడానికి వీలుగా రివాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టారు స్కీం (ఆర్‌డిఎస్ఎస్) పథకం ద్వారా రూ.250.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లాలో సముద్ర తీరం వెంబడి తుప్పుపట్టిన కండక్టరును 25 కిలో మీటర్ల మార్చేందుకు యాజమాన్యం అనుమతించింది. వీటితో పాటు వ్యవసాయ ఫీడర్లు, ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫోల్స్ మార్పిడి జరుగుతోంది. నెట్‌వర్కు ప్రక్షాళన చేపడుతున్నాం. ఇప్పటికే 42 వ్యవసాయ ఫీడర్లు, 12 ఓవరు లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, 1945 ఫోల్స్ మార్పిడి పూర్తయింది. 2025 చివరి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంది.

? వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారా?

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. ఏటా వేసవిలో పెద్దఎత్తున ఎసిల వాడకం పెరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో రూ.10 కోట్ల వ్యయంతో ఏడు పెద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమరుస్తున్నాం. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్ల పరిధిలో గార మండలం చల్లపేట, పిసిని, లోలుగు, వీరఘట్టం, జి.సిగడాం, పిన్నింటిపేట, మబుగాం, జి.సిగడాంలలో వీటిని అమరుస్తున్నాం. రూ.20 కోట్లతో వేసవి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించాం. ఆరు జగనన్న కాలనీల్లో సబ్ స్టేషన్ల మార్చాం. లుంబూరు, పాతృనివలస, పొన్నాడ, వాకలవలస, గాజులకొల్లివలస, రామకృష్ణాపురంలో వీటిని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశాం. కొత్తూరులో రూ.48 కోట్లతో 132-30 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇటీవల సిఎం వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే భామిని, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, పాలకొండ, సీతంపేట మండలాలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

? బకాయిల వసూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రతినెలా 2 నుంచి 10 లోపు రీడింగ్ తీసుకుంటున్నాం. రీడింగ్ తీసిన సమయంలో బిల్లు అందిన వెంటనే వినియోగదారులు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. 15 వరకు బిల్లులు చెల్లించేందుకు గడవు ఉంటుంది. ఆ తర్వాత చెల్లించే బిల్లులపై 18 శాతం సర్‌ఛార్జీలను వసూలు చేస్తారు. శ్లాబ్‌లతో పనిలేకుండా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 30లోగా అపరాధ రుసుంతో బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపి వేస్తాం. అందువల్ల బిల్లులు అపరాధ రుసుం లేకుండా సకాలంలో బిల్లులు చెల్లించాలి. డిసెంబరు నుంచే ఈ విధానం అమలులోకి వస్తుంది. అలాగే వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబరును వినియోగించుకోవాలి. ఈ నంబరుకు ఫోన్ చేసిన వెంటనే రౌండ్‌దిక్లాక్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నాం. ఈ సౌకర్యాన్ని వినియోగాదారులు వినియోగించుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు జిల్లాలో రూ.25 కోట్ల మేర ఉన్నాయి. వాటిని ఆయా శాఖల ద్వారా వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఉపాధ్యాయులపై ప్రభుత్వ వైఖరి మారాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఉపాధ్యాయులపై ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మలు పేర్కొన్నారు. నగరంలోని ఎపిటిఎఫ్ కార్యాలయ నూతన భవన నిర్మాణం పనులకు సీనియర్ సభ్యులు బొడ్డేపల్లి అప్పయ్య, సువ్వారి అచ్చన్నాయుడు, సిహెచ్.ప్రభాకరరావు, హనుమంతు కృష్ణమూర్తిలతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిపాండురంగ వరప్రసాదరావు, ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, విజయనగరం పార్వతీపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న హెచ్‌ఎం చిన్నంనాయుడు

జనవరి నాటికి 'నాడు-నేడు' పనులు పూర్తి

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో పాఠశాలల్లో నాడు-నేడు పనులు జనవరి నాటికి పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకర్ లాఠకర్ అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.చిన్నంనాయుడు నాడు-నేడు పనులకు సంబంధించి నిధులు లేకపోవడంతో అర్ధాంతంగా పనులు నిలిచిపోయాయని, తక్షణమే నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పనులు డిసెంబర్ చివరి నాటికి లేదా జనవరి నాటికి పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉందని, దీనికి ప్రభుత్వం ప్రణాళిక చేపడుతుందన్నారు. ఆయనతో పాటు ఆర్‌డిఒ భరత్‌నాయక్, తహశీల్దార్ మధుసూదనరావు, ఎలక్షన్ డిటి రాంబాబు, ఆర్ఐ నిరంజన్ తదితరులు ఉన్నారు.

బొత్స సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎచ్చెర్ల వైసిపి నాయకులు

మంత్రి బొత్సకు పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్ర విద్యాశాఖామంత్రి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యన్నారాయణను ఆదివారం హైదరాబాద్‌లో తన నివాసంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు పరామర్శించారు. ఇటీవల మంత్రికి గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని లెంకోహిల్స్‌లోని మంత్రి స్వగృహంలో కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, వైసిపి నాయకులు మీసాల జగన్, దాగూర్, పతివాడ గురునాయుడు ఉన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ

పలాస: మండలంలో నీలావతి గ్రామంలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి పెద్ద మాకన్నపల్లి గ్రామానికి చెందిన కుత్తుం నీలకంఠం ఆదివారం రూ.13 వేలు విలువ చేసే 25 కుర్చీలు వితరణ చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యువివి అధ్యక్షులు ఇసాకోట జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, గౌరవ ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, ఆర్థిక కార్యదర్శి ఎంపల్లి కామేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు తెప్పల వాసుదేవరావు, అకాడమిక్ సెల్ కన్వీనర్ పి.బాలరాజు, ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్, సభ్యులు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

బిజెపి విజయం అభినందనీయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించడం అభినందనీయమని విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. ఆదివారం రణస్థలం మండల కేంద్రం రామతీర్థాలు కూడలి వద్ద 16 నంబర్ జాతీయ రహదారిపై బిజెపి నాయకులు, కార్యకర్తలు బాణా సంచా కాల్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పీవి రత్నం, జిల్లా కార్యదర్శి మన్నె సురేష్ కుమార్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె శ్యామ్‌కుమార్, ఎస్‌సి మోర్చా స్టేట్ సెక్రటరీ దుక్క ఆదినారాయణ, రాష్ట్ర ఎస్‌సి మోర్చా కార్యవర్గ సభ్యులు దన్నాన రాజేంద్ర, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గురాల రఘునాథ్ పాల్గొన్నారు.

భారీ కొండచిలువ హతం

కవిటి : మండలం వరక గ్రామంలో ఆదివారం సాయంత్రం భారీ కొండ చిలువను గ్రామస్తులు హతమార్చారు. గ్రామానికి చెందిన సుకంత పురియ తోటలో సుమారు 12 అడుగుల పొడవున్న కొండ చిలువ గ్రామం వైపు వస్తున్నట్టు అటువైపు వెళ్లిన కొందరు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై గ్రామస్తుల సహకారంతో కొండ చిలువను హతమార్చారు.

కుమార్ రాజుకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ, కళావేదిక కార్యదర్శి బుర్రి కుమార్ రాజుకు సాహితీ కిరణం, మాసపత్రిక యాజమాన్యం పొత్తూరి సుబ్బారావు వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజుల ఆధ్వర్యాన సన్మానించారు. నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో పొత్తూరి అన్నపూర్ణమ్మ శత జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పొత్తూరులో ఎందరో ప్రముఖులు మధ్య ఆదివారం ఘనంగా కవి సత్కారించారు. కళావేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఈ వేమన, జంధ్యాల శరత్ బాబు, ఎస్,ఎం.సుభానీ, బండికల్లు జమదగ్ని, నాటక రచయిత, నటుడు విడదల సాంబశివరావు, కవి మిత్రులు సయ్యద్ జానీ బాష, జి.నసరయ్య, పింగళి భాగ్యలక్ష్మి, తాటికోల పద్మావతి అభినందించార. కార్యక్రమంలో అరసవల్లి గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథ పాలకులు వి.ఎస్.శంకరరావు, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సాహితీవేత్తలు

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

టెక్కలి రూరల్ : రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమల్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల జాబితాను పరిశీలించి బిఎల్ఒలకు పలు సూచనలు చేశారు.

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి, చాపర పోలింగ్ కేంద్రాలను జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ పరిశీలించారు. నూతన ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బిఎల్ఒలకు సూచించారు. ఈయన వెంట తహశీల్దార్ పి.సరోజని, డిటి శంకరరావు, సత్యనారాయణ ఉన్నారు.

బూర్జ: మండలంలోని లాభాం పంచాయతీకి సంబంధించిన 244, 245 పోలింగ్ బూత్‌లనుతహశీల్దార్ రమణారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. బిఎల్ఒలు ఎటువంటి విమర్శలకు తావి వ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని ఆదే శించారు. ఆయనతో పాటు బిఎల్ఒ రామచంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

జి సిగడాం: ఓటర్ల జాబితాలో తప్పులుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ వేణుగోపాలరావు హెచ్చరించారు. మండలంలో పెంట, నాగులవలస, సీతంపేట, మెట్టవలస, ఎస్‌పిఆర్ పురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మరణించిన వారి ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉంటే తొలగించాలని బిఎల్ఒలకు ఆదేశించారు. ప్రతి ఓటరుకి ఇంటి నెంబరు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తుది ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రామచంద్రరావు, పెంట సర్పంచ్ పున్నాన అప్పలనాయుడు, బిఎల్ఒలు, నాయకులు పాల్గొన్నారు.

బూర్జ: బిఎల్ఒలతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమణారావు

వజ్రపుకొత్తూరు: ఓటరు నమోదుకు యువత ముందుకు రావాలని తహశీల్దార్ అప్పలస్వామి అన్నారు. మండలంలోని ఒంద్రుకుడియా, బెండి, కిడిసింగి, డోకులపాడు, రిట్టపాడు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అక్కడ నమోదవుతున్న కొత్త ఓటర్ల వివరాలను దరఖాస్తులను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా కొత్తగా ఓటు హక్కు కోసం 61మంది దరఖాస్తు తీసుకున్నారని తెలిపారు. ఓటు హక్కు తొలగింపు కోసం 26 దరఖాస్తులురాగా, వివరాలు సవరించాలంటూ 188 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే తహశీల్దార్ వనిత, బిఎల్ఒలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న జోగినాయుడు

ఉత్తమ క్లబ్‌గా స్టార్ వాకర్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ సదస్సు ఆదివారం విజయనగరం జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సదస్సుకు వాకర్స్ గవర్నర్ కె.సత్యం అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఉత్తమ సామాజిక సేవలకు గాను శ్రీకాకుళం నగరంలోని స్టార్ వాకర్స్ క్లబ్ ఉత్తమ క్లబ్‌గా ఎంపికైంది. ఓవరాల్ ఛాంపియన్ షిప్ అవార్డ్ కూడా దక్కించుకుంది. దీంతో పాటు ఉత్తమ సేవలు అందించే వాకర్ క్లబ్‌ల్లో నగరానికి చెందిన మారుతీ వాకర్స్ క్లబ్, ఆదిత్య వాకర్స్ క్లబ్, సూర్య వాకర్స్ క్లబ్స్‌లకు పలు అవార్డులు దక్కాయి. సెమినార్‌లో ఈ అవార్డులను వాకర్స్ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సదస్సుకు శ్రీకాకుళం నుంచి వాకర్స్ ప్రతినిధులు కూన వెంకటరమణ మూర్తి, పి.జి.గుప్తా, గుడ్ల సత్యనారాయణ, శాశపు జోగినాయుడు, ఎస్.సంజీవరావు, కొంక్యాన మురళీధర్, బి.దేవీప్రసాద్, సురేష్ పండా, సింహాద్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

వికలాంగులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జగనన్న ప్రభుత్వంలో వికలాంగులను సంక్షేమం దిశగా కృషి చేస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆవులు వేణుగోపాలరావు వికలాంగుల ప్రపంచ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు ఇస్తున్న పెన్షన్ రూ.3వేలకు జగన్ పెంచారన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి చట్టంలో పొందుపర్చిన చట్టాలు తూచా తప్పకుండా భారతదేశంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు పెన్షన్ హామీ ఇచ్చారని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వికలాంగులను పర్మనెంట్ చేయాలన్నారు. డిగ్రీ చదువుకున్న అందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం వికలాంగులకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి వాకాడ శ్రీధర్ రెడ్డి, వికలాంగులు పాల్గొన్నారు.

పలాస: వికలాంగులకు ప్రభుత్వం అండగా ఉందని, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంఘాలుగా ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి రుణాలు మంజూరు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మాదిరిగా కొంతమంది విభిన్న ప్రతిభవంతులను సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమాజంలో అంగవైకల్యాన్ని అధికమించే విధంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కౌన్సిలర్లు సనపాల సింహాచలం, పప్పల ప్రసాద్, బల్ల రేవతి శ్రీనివాస్, దున్న సత్యం, మెప్మా అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృపారాణి

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి- టెక్కలి

జాతీయ ఉపకార వేతనం ఎంపిక (ఎన్ఎంఎస్ఎస్) పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పలు పాఠశాలల్లో నిర్వహించే కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. నిర్ణీత సమయానికే విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఇందుకోసం 23 పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేసారు. జిల్లాలో 5,533 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,442 మంది హాజరయ్యారు. రెండు డివిజన్‌లలో పలు కేంద్రాలను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మ పర్యవేక్షించి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

పలాస: పలాస డివిజన్ పరిధిలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు 1774 మంది విద్యార్థులు హాజరయ్యారు. పలాస, ఇచ్ఛాపురం, కవిటి కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి 1800 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1774 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో పలాస ఉన్నత పాఠశాలలో

టెక్కలి : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పగడాలమ్మ

264 మందికి 259 మంది, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో 240 మందికి 235 మంది, భాష్యం పాఠశాలలో 240 మందికి 237 మంది, గురుకుల పాఠశాలలో 240 మందికి 238 మంది, ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 288 మందికి 284 మంది, నారాయణ పాఠశాలలో 240 మందికి 236 మంది, శ్రీ చైతన్య పాఠశాలలో 288 మందికి 285 మంది విద్యార్థులు పరీక్షలు రాసారు. పరీక్ష కేంద్రాలు వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను టెక్కలి ఉప విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ, పలాస ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు పరిశీలించారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా అత్యున్నత పదవిని చేపట్టి పదేళ్ల పాటు భారత తొలి పౌరుడిగా మహోన్నత సేవలందించిన బాబు రాజేంద్రప్రసాద్ 1884 డిసెంబర్ 3న జన్మించారని అన్నారు. ఈ సందర్భంగా

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించి చదవడం మాకిష్టం కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి తీరంలో సురక్షిత ప్రాంతాలకు చేర్చిన బోట్లు

మత్స్యకారులు అప్రమత్తం

వజ్రపుకొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మిచౌంగ్ తుపానుగా బలపడడంతో తీర ప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం కడలి కల్లోలంగా మారి ఈదురు గాలులు వీస్తున్నాయి. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇంటికే పరిమితమయ్యారు. దేవునల్తాడ, కొత్తపేట, కంబాల రాయుడుపేట, డోకులపాడు, అక్కుపల్లి, గునుపల్లి చేపలవేట తీరాల్లో అలల అలజడి ఎక్కువై అలలు తీరానికి సుమారు 50 మీటర్ల ముందుకు వచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు. తీరంలోని 11 మత్స్యకార పంచాయతీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని దండోర వేయించామని తహశీల్దార్ అప్పలస్వామి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో 9550669551తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 14 మంది రెవెన్యూ సిబ్బందిని కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంచామని తహశీల్దార్ తెలిపారు. వరి పంటను కోసిన రైతులు కూడా ఆందోళనకు గురవుతున్నారు.

బూర్జ: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమణారావు సూచించారు. నాగావళి నదీతీర ప్రాంతాలైన అల్లెన, కిలంతరి, లాభాం తదితర గ్రామాల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నది సమీపానికి వెళ్లవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో కార్యాలయానికి సమాచారం అందించాలని ఆదేశించారు.

పలాస: సోమ, మంగళవారాల్లో తుపాను తీవ్రంగా ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎల్.మధుసూధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో తుఫాను తీరం దాటే ప్రమాదం ఉందని, రైతులు తమ పంటలను కోత కోయవద్దని, కోసిన వారు కుప్పలు భద్ర పరుచుకోవాలని సూచించారు. 70 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంటుందన్నారు.

పిక్నిక్ సందడి

పోలాకి: మండలంలో రాజారాంపురం సముద్ర తీరంలో పిక్నిక్ సందడి నెల కొంది. కార్తీక మాసంలో 3వ ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి యువకులు సముద్ర తీరానికి చేరుకొని సందడిగా గడిపారు. ముందుగా జీడి

తీరంలో సందడి చేస్తున్న యువకులు

తోటల్లో స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆట, పాటలతో మధ్యాహ్నం వరకు గడిపి, తదుపరి వనబోజనాలు చేసి అనంతరం సముద్ర స్నానాలు ఆచరించి వెనుతిరిగారు. తుపాను హెచ్చరికలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా కార్తీకమాసంలో ఆచరించాల్సిన సంప్రదాయంతో సరదాగా గడిపారు. అలాగే సముద్ర తీరంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు.

నిస్వార్థ సేవలు అందించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఏలియన్స్ క్లబ్ ద్వారా నిస్వార్థ సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏలియన్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు అథ్లెటిక్స్ జాతీయస్థాయిలో ఒకప్పుడు మంచి ప్రతిభ కనబరిచిన ఆశి తులసయ్య రెడ్డి, శివకుమార్‌లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు లోపింటి నరసింహామూర్తి మాట్లాడుతూ క్లబ్ సాధించిన విజయాలు, చేయాలనుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. ఈ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, కార్యదర్శి లక్ష్మణరావు, రామారావు, క్లబ్ సభ్యులు గోపీనాథ్ రెడ్డి, ఉమాశంకర్, యోగి ఎల్‌పిసి బుజ్జి, నరసింహామూర్తి, లోహిదాస్, వెంకటరమణ, రమణ సత్యమయ్య, మధు బాల, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుతున్నారు

పిసిసి ఉపాధ్యక్షులు సత్యవతి

ఆమదాలవలస : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకొని కాంగ్రెస్‌ను గెలిపించారని రాబోయే ఎన్నికల్లో ఎపిలో కూడా ప్రజల మార్పును కోరుకుంటున్నారని రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో ఆదివారం పట్టణంలో తన స్వగృహంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేయడంతో ఎపిలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని అపార్థం చేసుకొన్నారని, తెలంగాణ ప్రజలు కెసిఆర్ మాటలను, సెంటిమెంట్‌ను నమ్మి టిఆర్ఎస్‌కు రెండుసార్లు పట్టం కట్టారన్నారు. కెసిఆర్ దుర్మార్గపు పాలనను భరించలేక కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి తీర్పు ఇచ్చారన్నారు. రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ సమన్వయం చేసుకొని పార్టీని బలోపేతం చేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డేపల్లి గోవింద గోపాల్, నాయకులు లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, లఖినేని సాయి, గురుగుబెల్లి కృష్ణమూర్తి, బొత్స రమణ, దాలయ్య పాల్గొన్నారు.

టెక్కలి: తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం హర్షణీయమని, కాంగ్రెస్ పార్టీతోనే అబివృద్ధి సాధ్య పడుతుందని అక్కడి ప్రజలు గుర్తించారని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా

ఆమదాలవలస : సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మాట్లాడుతూ ఆ రాష్ట్ర ఎన్నికల ప్రభావం ఎపిలో కూడా చూపుతుందన్నారు. జిల్లా కిసాన్ పార్టీ అధ్యక్షులు కోత మధుసూదనరావు, ఆనందరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో రణస్థలం పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మీ, కె.జోగినాయుడు, ఎ.జగదీష్ నాయుడు, ఎం.గణేష్, వై.సూర్యనారాయణ, ఎం.రమణ పాల్గొన్నారు.

వివాహిత మృతి

ప్రజాశక్తి- పలాస

స్పందన (ఫైల్)

మూడు నెలల క్రితం వివాహం చేసుకున్న యువతి పసుపు పారాణి అరక ముందే మృత్యువు ఒడిలోకి చేరుకుంది. కాశీబుగ్గకు చెందిన తాళాసు శ్రీనును మూడు నెలల క్రితం స్పందన (24)తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. మూడు నెలల్లోనే ఆమె మృతి చెందడం జంట పట్టణాల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు పలాసకు చెందిన రేషన్ డీలర్ తంగుడు వినోద్ కుమార్తె స్పందనకు కాశీబుగ్గలో బంగారం, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న తాళాసు శ్రీనుతో మూడు నెలలు క్రితం వివాహమైంది. తాళాసు శ్రీను, స్పందన దంపతులు ఇటీవల తమ బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లి శనివారం మధ్యాహ్నం పలాసలోని తమ స్వగృహానికి చేరుకున్నట్లు తెలిసింది. శనివారం అర్ధరాత్రి స్పందనకు గుండెనొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్న తరుణంలో స్పందన మృతి చెందినట్లు కుటుంబీకులు చెబుతున్నారు. అయితే ఈ మృతిపై స్పందన తల్లిదండ్రులుగాని, ఇతర బంధువులుగాని పోలీసులకు ఎటువంటి ఫిర్యాదులు చేయలేదు. పెళ్లి అయిన మూడు నెలలనే స్పందన మృతి చెందడంపై ఆ సామాజిక వర్గ ప్రజలతో పాటు బంధుమిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

పలాసలో మనస్థాపంతో ఆదివారం పి.హరి(30) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎఎస్ఐ గణపతిరావు తెలిపారు. ఈయన భార్య భాను ఆరు నెలల క్రితం పిల్లలు పుట్టలేదని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి హరి మద్యం సేవిస్తూ తీవ్ర మనోవేదనలో ఉండేవారని, ఈ క్రమంలో తన ఇంటిలో ఫ్యానుకు ఉరిపోసుకొని మృతి చెందాడని, ఉదయం సమీప ప్రజలు విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో విషయం బైయటకు వచ్చిందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

18 మందికి గాయాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం పెద్దబమ్మిడి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం యలమంచిలి గ్రామానికి చెందిన ఎం.లచ్చెమ్మ, కె.అమ్మాజీ, ఎస్.నీలవేణి, ఎం.లక్ష్మి, కె.త్రివేణి, కె.రమేష్, వి.పార్వతితో పాటు మరో పదిమందికి గాయాలయ్యాయి. నరసన్నపేటలో పరామర్శకు వెళ్లేందుకు ఆటోలో వీరంతా యలమంచిలి గ్రామం నుంచి వెళ్తుండగా పెద్ద బమ్మిడి సమీపంలోకి వెళ్ళే సరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. వీరికి 108 సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ వైద్యులు సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు వైద్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ రమేష్ నిర్లక్ష్యం, అధిక వేగం కారణంగానే ఆటో బోల్తాపడిందని పలువురు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ఆదిఆంధ్రావీధిలో కార్డాన్‌సెర్చ్

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ ఆదిఆంధ్రావీధిలో డిఎస్‌పి బాలచంద్రరెడ్డి ఆదేశాలు మేరకు సిఐ సూర్య చంద్రమౌళి అధ్వర్యంలో టెక్కలి ఎస్ఐ ఎల్. రామకృష్ణ, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి ఎస్ఐలు, సిబ్బందితో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఆరు ద్విచక్ర వాహనాలకు ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

భువనేశ్వరిని కలిసిన లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జైలు నుంచి విడుదలైన తర్వాత వివిధ ఆలయాలను సందర్శించడంలో భాగంగా ఆదివారం విశాఖ నగరంలోని సింహాచలం వరహా నృసింహస్వామి ఆలయాన్ని మాజీ సిఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరిలు ఆదివారం సందర్శించారు. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పట్టు వస్త్రాలను అందజేశారు.

గ్రామాల్లో చైతన్య పర్యటన

మెళియాపుట్టి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి గేదెల చైతన్య సందర్శించారు. మర్రిపాడు పంచాయతీ సర్పంచ్ రవ్వల అనురాధను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దీనిబంధుపురం గ్రామానికి చెందిన రామారావు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను పరామర్శించి ఓదార్చారు. ముకుందపురం, మూల ముకుందుపురం, సవర ముకుందపురం, గొడ్డ, పద్ద గ్రామాల్లో పర్యటించి పలువురు టిడిపి, జనసేన నాయకులను కలిశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన సంయుక్తంగా విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, సవలాపురం చంటి, చింతల ప్రశాంత్, కిరణ్ రామ్మూర్తి, హరికృష్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నరసన్నపేట: మన చుట్టు ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బి.శంకర్ అన్నారు. ఆదివారం నరసన్నపేటలో మార్కెట్ స్థలంలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిసరాల్లో ఉన్న వారికి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాపారులు చెత్తను మార్కెట్‌లో వేయకుండా దూరంగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒ సవర చిన్నారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికలు

పలాస: ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం 2 గంటలకు టెన్నికాయిట్ రాష్ట్ర పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి పి.తవిటయ్య తెలిపారు. 41వ సీనియర్ (పురుషులు, మహిళలు) టెన్నికాయిట్ రాష్ట్ర పోటీలు పాతపట్నంలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరుగనున్నాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తమతో తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.